


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

109

**(4 జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఇటీవల** ప్రఖ్యాత నటుడు రఘురామయ్యగారిని రెండు పద్యాలు పాడమని అడిగాం మా బంధువుల ఇంట్లో. ఆయన కొంచెం సేపు ఆలోచించి "కొద్దిగా లవంగాలు తెప్పించండి" అన్నారు. కానీ, ఇంట్లో లవంగాలు లేకపోయినాయి. ఒక కుర్రవాణ్ణి పిలిచి అంగడికి వెళ్ళమన్నాం.

ఆయన "వద్దులెండి, ఇంట్లో వున్నాయేమోనని అడిగాను. లవంగాలు సామాన్యంగా నోట్లో వేసుకోను. కానీ అవి దగ్గరపెట్టుకుంటే చాలు. అలా అలవాటైంది" అన్నారు. లవంగాలు దగ్గరవుంటేనే చాలు సంగీతం వస్తుందాయనకు.

మా చిన్నతనంలో ఒక గాయకుడుండేవాడు. ఆయన సంగీతం పాడాలంటే రెండు గుప్పెళ్ళు కందిపప్పు దగ్గిర ఉండాలి. మధ్య మధ్య రెండు బద్దలు నోట్లో వేసుకుంటూంటేగాని రాగం పెగిలేదికాదాయనకి. ఆయనగారు ఎక్కువగా కమాచిరాగం పాడుతూండేవారు.

అది చూచి కొందరు 'కందిపప్పుకి, కమాచి రాగానికి ఏదో సంబంధం వుంద'ని ఆయనతో హాస్యంగా అంటూ వుండేవారు. మొత్తం మీద ఆయనగారిని "కందిపప్పు గాయకుడు" అనేవారు.

శ్రీ రఘురామయ్యగారు లవంగాలు దగ్గర పెట్టుకుని పాడుతుంటే సంగీతానికి అవి దోహదాలు కదా అనిపించింది. తర్వాత ఆయన అన్నారు: "ఒక్క లవంగాలే కాదు, ఏదే నా కారపు వస్తువు దగ్గర వుండాలి సార్. మిరియం, శొంఠి వగైరాలలో ఏదో ఒకటి" అన్నారాయన.

ఈయనకు సంగీతం మీద ఎంత ప్రీతో. వ్యాయామం, యోగాభ్యాసాల మీద అంత ప్రీతి. వారింట్లో తంబూరా ఒక మూల వుంటే, కసరత్‌లో ఉపయోగించే ఇనపబార్ ఒక ప్రక్కన ఉంటుంది. ఆయన ఎప్పుడు మాట్లాడినా సంగీతానికి, ఆరోగ్యానికి గల సంబంధాన్ని గురించి ఎక్కువగా చెపుతూ వుంటారు. తను యోగాభ్యాసం చేస్తూ తరాన్ని ఎలా కాపాడుకునేది చెపుతూంటారు. ఊపిరితిత్తుల్ని ఎలా రోజూ శుభ్రం చేసుకోవాలో వర్ణించి, ఇతరులక్కూడా నేర్పుతానంటూ వుంటారు. గొంతులో అనేక వింత తీగలున్నాయంటారు.

మొత్తం మీద "మంచి శరీరంలోనుంచి మంచి సంగీతం వెలువడుతుంది" అనే సిద్ధాంతాన్ని ఆయన ఎప్పుడూ అమలులో వుంచుకుంటారు. 'గాయకుడికి ఊపిరి ఊపిరి తిత్తులు అవి బలంగా వుండాలి. అప్పుడు ఖంగుమని రాగం రావాలి' అంటారాయన. ఈ సందర్భంలో జార్జి మెరిట్‌తో జ్ఞాపకం వస్తాడు. ఈయన విక్టోరియన్ యుగానికి చెందిన ప్రఖ్యాత రచయితా, వేదాంతి. ఈయనకు బల ప్రదర్శనలంటే ఎంతో యిష్టం. కాస్త తీరిక దొరికితే అనేక కసరత్ ఫీట్స్ చేస్తూ వుండేవాడు.

పెద్ద పెద్ద ఇనుప చక్రాల్ని దూరంగా విసురుతూ వుండేవాడు. ఇనప కడ్డీలను గాలిలోకి ఎగరవేసి పట్టుకుంటూ వుండే వాడు. కొన్ని సందర్భాలలో ఇనపకడ్డీలను తలమీద పెట్టుకుని, రెండు చేతులతో వాటిని వంచుతూండేవాడు. చిన్న చిన్న వాసపు ముక్కల్లాగా. మానసిక విభూతికీ, శారీరక దారుఢ్యానికి ఆయన చక్కటి అనుబంధం కుదిర్చి, రెండు శాఖల్లో "శాండో" అనిపించుకునేవాడు.

లలితకళల ఆరాధనకు ప్రశాంతత అవసరమని చాలామంది అభిప్రాయం. కాని కొందరికి ఎంత గందరగోళంలోనైనా లలితకళల్ని ఆరాధించటం అలవాటు. అలాంటి వారిలో ఆస్కార్ వైల్డ్ ఒకరు. ఆయన హోటల్లో ఆర్కెస్ట్రా మోగుతుండగా, పెళ్ళివాళ్ళ ప్రక్కన కూర్చుని ఆయన రచనలోకల్లా గొప్ప గ్రంథం ఒకటి సృష్టించాడట. ప్రఖ్యాత కళాకారుల జీవితాలలో అనేక వింత అలవాట్లుంటాయి మరి.

ప్రఖ్యాత రచయిత హెమింగ్ వే ఒక తెల్లటి గోపురం లాంటి కట్టడం సృష్టించుకుని దానిమీద గువ్వలాగా కూర్చుని వ్రాస్తుండేవాడుట. అంతేకాదు, ఆయనకు ప్రకృతిమీదా, పశుపక్ష్యాదులమీదా ఎంతో అబిమానం, ఆసక్తీ వుండేవట.

ఆయన చూట్టూ ఎప్పుడు చూసిన పదహారు శునకాలు, పది ఆవులు, యాభై పిల్లులూ, ఒక వంద పావురాలు వుండేవట. వాటి భవు భవుల మధ్య, మ్యావ్‌మ్యావ్‌ల మధ్య, అంబా అనే అరుపుల మధ్య ఆయన బుర్ర పాదరసంలాగా పనిచేసేదట. కలం అతి వడిగా పరుగెత్తేదట

ప్రపంచ ఖ్యాతి చెందిన టాల్‌స్టాయ్‌కి రైలు కూతలు వినడమంటే ఎంతో యిష్టం. అందులో ఫైర్ ఇంజన్ కూత అంటే మరీ యిష్టం. ఆ కూత వినబడగానే ముఖం విప్పారేది. మంచి సంగీతం వింటున్నట్లుగా సంబరాలుపడేవాడుట. అంతేకాదు. ఇతరుల దృష్టిని ఆకర్షించే వింత పనులు కొన్ని చేస్తూవినడం ఆయనకు అలవాటు. ఒకసారి కనుబొమలు తీసివేసి, వీధుల్లో తిరగడం మొదలు పెట్టాడుట. అంతకంటే వెర్రి ఆలోచనలు కూడా వస్తుండేవాయనకు. వాటిలో ఒకటి ఏమిటంటే తాను కావాలంటే పక్షిలాగా పైకి ఎగరగలననే భ్రాంతి, భ్రాంతి వుండటం సరే, ప్రయత్నం కూడా చేసేవాడు. ఒకసారి మేడ రెండో అంతస్తునుండి ఎగరటానికి ప్రయత్నం చేశాడు. అక్కడనుంచి క్రిందపడటం, స్పృహ తప్పడం జరిగింది. అయితే, ఆయువు ఎక్కడో దాగివుండి, మళ్ళీ బ్రతికించి, కలం చేతపట్టించింది.

కొందరు రచయితలకు మరీ విచిత్రమైన అలవాట్లుంటాయి. ఒకచోట కూర్చుని కలం పట్టి వ్రాయటం కుదరని వాళ్ళు చాలామంది ఉన్నారు. ప్రఖ్యాత రచయిత విక్టర్ హ్యూగోకు 1852లో ద్వీపాంతరవాస శిక్ష విధించారు. వెళ్ళి ఒక ద్వీపంలో చేరాడు. అక్కడ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన "లేమిజరబుల్స్" గ్రంథాన్ని వ్రాశాడు. అదైనా ఎలాగో తెలుసా నిటారుగా నిలబడి మరి ఎలా తంటాలు పడ్డాడో ఏమో, కొంగజపం చేస్తూ ఒక గొప్ప గ్రంథం వ్రాశాడు.

అలగ్జాండర్ డ్యూమన్ గ్రంథం వ్రాసేటప్పుడు మంచి భావాలు రాకపోతే, వెంటనే ఒక జపాను గౌను తీసుకుని తొడుక్కునేవాడు. తిండి అపరిమితంగా తినేవాడుట. కాని, కాఫీ, సిగరెట్లు వగైరాలను దగ్గరకు రానిచ్చేవాడుకాదుట. అప్పుడప్పుడు కొంచెం నిమ్మరసం పుచ్చుకునేవాడుట.

వ్రాస్తుండగా ఎవరైనా మిత్రులు వస్తే, తన భావాలు తెగిపోకుండా కుడిచేత్తో వ్రాస్తూనే ఎడంచేత్తో కరచాలనం చేసేవాడుట. కాగితాలు బల్లమీద పెట్టి వ్రాయటం ఈయనకి చేతకాదుట. అందువల్ల ఒక సోఫాలో పడుకుని దిండు మీద వ్రాలి, కాగితాలు సోఫాలోనే పెట్టుకుని, ఎంతసేపైనా వ్రాసేవాడుట.

లాయిడ్ జార్జి వ్రాత పద్ధతి మరీ విచిత్రంగా ఉండేది. మంచం మీద వెల్లకిల పరుండి పెన్సిలుతో త్వరత్వరగా వ్రాసి పారేసేవాడు. ఆ వ్రాత ఆయనగారి టైపిస్టులకు మాత్రమే అర్థమయ్యేది. వాళ్ళక్కూడా అర్థం కాకపోతే ఆ కాగితాల గతి అంతే. మళ్ళీ వ్రాయాల్సిందే మరి ఆయన వ్రాత ఆయనకే అర్థమయ్యేదికాదు. అందువల్ల అలాంటి శిక్షపడేది పాపం.

Post your comments